క్లుప్తంగా

18న మండల పరిషత్ సమావేశం

కంకిపాడు: కంకిపాడు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.అనూష తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె వివరాలు తెలుపుతూ ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు ఈనెల 14వ తేదీలోపు తమ శాఖల ప్రగతి నివేదికలను సమర్పించాలని సూచించారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఎమ్మెల్యే యార్లగడ్డకు అభినందన



విజయవాడరూరల్: గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన యార్లగడ్డ వెంకట్రావ్‌ను విజయవాడ రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు సోమవారం రాత్రి ప్రసాదంపాడు గ్రామంలో కలిసి అభినందనలు తెలియజేశారు. ఏపీ రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జిటివి.వెంకటరమణ(నున్న) ఆధ్వర్యంలో మండలంలోని రామవరప్పాడు, ప్రసాదంపాడు, పాతపాడు, అంబాపురం, నిడమానూరు, గూడవల్లి, ఎనికేపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఎమ్మెల్యే వెంకట్రావ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఇదే సందర్భంలో మండల తహసీల్దారు పి.జాహ్నవిరెడ్డి, డ్వామా పీడీ జె.సునీత, రూరల్ మండల పరిషత్ సిబ్బంది కూడా ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలియజేశారు.


వాహనాల దారి మళ్లింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: గన్నవరం మండలం కేసరపల్లిలో బుధవారం నారా చంద్రబాబు నాయుడి ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్ వద్ద పోలీసులు పలు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. విశాఖపట్నం నుంచి చెన్నై వైపు వెళ్లే వాహనాలను హనుమాన్‌జంక్షన్ ప్రధాన కూడలి నుంచి గుడివాడ వైపు మళ్లించారు. హైదరాబాద్ వైపు వెళ్లాల్సిన వాహనాలను నూజివీడు వైపు దారి మళ్లించారు. ఈ మేరకు 16వ నంబర్ జాతీయ రహదారిపై హనుమాన్‌జంక్షన్ బైపాస్ రోడ్డులో భారికేట్లు ఏర్పాటు చేశారు.

అభయాంజనేయస్వామి సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయుడికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు క్లోపల్లి సత్యనారాయణ ప్రదీప్‌కుమార్ రాజు సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలవరం కాల్వ రోడ్డుపై తుమ్మచెట్లు తొలగింపు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో పోలవరం కాల్వను ఆనుకుని ఉన్న రోడ్డుపై ప్రజల రాకపోకలకు ఆటంకం కల్గిస్తున్న ఇంగ్లీషు, తుమ్మచెట్లను టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జేసీబీ మిషన్‌తో మంగళవారం తొలగించారు. ఈ రోడ్డుపై స్థానికులు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తున్న సందర్భంలో గుబురుగా పెరిగి రాకపోకలకు ఆటంకం కల్గిస్తున్న తుమ్మచెట్లు, ఇంగ్లీషు చెట్లను తొలగించారు. శ్రీనివాసరెడ్డితో పాటు పంచాయతీ వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు సెలవు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమం నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు విజయవాడ నగరం, విజయవాడ రూరల్ పరిధిలోని సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, ఇతర సెంట్రల్ బోర్డ్ ప్రైవేటు విద్యా సంస్థలతో సహా అన్ని ప్రైవేటు విద్యా సంస్థలకు సెలవు ప్రకటించినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఈ సూచనలు పాటించాలని కోరారు.2024–2025 విద్యా సంవత్సరానికి ఈనెల 12కు బదులుగా అన్ని పాఠశాలలు ఈనెల 13 వ తేదీ నుంచి ప్రారంభించాలని విద్యా శాఖ మెమో కూడా ఇచ్చినట్లు తెలిపారు.

పేద విద్యార్థినులకు అండగా

- సకల సౌకర్యాలతో పెనమలూరు బాలికల వసతి గృహం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ. 25 లక్షలతో అభివృద్ధి
- విద్యార్థినులకు అందుబాటులో 100 సీట్లు

పెనమలూరు: నిరుపేద విద్యార్థినులను పెనమలూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఆదుకుంటోంది. జిల్లాలో అనేక ప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు మెరుగైన వసతులు కల్పించడమే కాకుండా బోధనపై ప్రత్యేక చర్యలు, నాణ్యమైన ఆహారం సమకూర్చుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో బాలికల సంక్షేమ వసతి గృహాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేయడంతో ఆదరణ పెరిగింది. వివరాల్లోకి వెళితే.. పెనమలూరు గ్రామం పేరంటాళ్ల చెరువు రోడ్డులో చాలా కాలం క్రితం ఎస్సీ బాలికల వసతి గృహం ఏర్పాటు చేశారు. అయితే వసతి గృహంలో అప్పట్లో సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థినులు చేరేవారు కాదు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి జిల్లా కలెక్టర్ జె.నివాస్ ప్రత్యేక శ్రద్ధతో మార్పు పథకం కింద బాలికల వసతి గృహం అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. మోడరన్ టాయిలెట్స్, విశాలమైన లివింగ్ రూమ్, మోడరన్ డైనింగ్ హాల్, ఆహ్లాదకరమైన వాతావరణంతో వసతి గృహంలో సకల సౌకర్యాలు కల్పించారు. గదుల్లోకి దోమలు రాకుండా ప్రత్యేకంగా మెస్‌లు సైతం ఏర్పాటు చేశారు.



అత్యాధునిక వసతులతో వసతి గృహం



చదువుకుంటున్న విద్యార్థినులు(ఫైల్)



ధ్యానం చేస్తున్న విద్యార్థినులు(ఫైల్)

వసతి గృహంలో 100 సీట్లు..

కాగా పెనమలూరు బాలికల వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయి. వీటిలో 70 శాతం సీట్లు ఎస్సీ బాలికలకు కేటాయించారు. మిగితా 30 సీట్లు ఓసీ, ఎస్టీ, బీసీ, దళిత క్రిస్టియన్ బాలికలకు ఇస్తారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటి వరకు 50 మంది చేరారు. ఇంకా 50 మంది విద్యార్థినులు చేరడానికి అవకాశం ఉంది. జిల్లాలో ఎక్కడి వారైనా ఇక్కడ అర్హత బట్టి చేర్చుకుంటారు. 3 నుంచి 9వ తరగతి చదువుకునే విద్యార్థినులకు అవకాశం ఉంటుంది. వీరు పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతారు. ట్యూషన్, ధ్యానం, విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటారు.

నాణ్యమైన ఆహారం..

వసతి గృహంలో బాలికలకు ప్రభుత్వం నాణ్యమైన ఆహారం పెడుతుంది. ప్రతీ ఆదివారం చికెన్ బిర్యాని, మంగళ, శుక్రవారాల్లో చికెన్, ప్రతి రోజూ కోడిగుడ్డు, పండు, వేరుశెనగ చిక్కి ఇస్తారు. అలంకరణ ఖర్చుకు 4వ తరగతి వరకు నెలకు రూ. 110, ఆ పైన తరగతుల విద్యార్థినులకు రూ. 160 చొప్పున ఇస్తారు. యూనిఫారాలు, పుస్తకాలు, దుప్పట్లు, ట్రంక్ పెట్టె, ప్లేట్, గ్లాస్, క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు, నాణ్యమైన టిఫిన్‌లు పెడతారు.

దరఖాస్తు ఇలా చేయండి..

వసతి గృహంలో చేరేవారు వార్డెన్‌కు దరఖాస్తు చేయాలి. టీసీ, విద్యార్థిని, తల్లిదండ్రుల ఆధార్‌కార్డుల జిరాక్స్, కుల ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థిని ఫొటో, బ్యాంకు ఖాతా, రేషన్‌కార్డుతో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. పేద విద్యార్థినులకు పెనమలూరు బాలికల వసతి గృహం ఎంతగానో అండగా ఉంటుంది.

పసుపు విత్తనానికి డిమాండ్

పచ్చ బంగారం (పసుపు) సాగుకు రైతాంగం సమాయత్తం అవుతున్నారు. తొలకరి పలకరింపుతో సాగుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. పొలాలు అదనుకు రావడంతో అవసరమైన విత్తనాన్ని సమకూర్చుకుంటున్నారు. విత్తనం కోసం రైతుల నుంచి డిమాండ్ పెరగడంతో పసుపు విత్తనం ధర భారీగా పలుకుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పుట్టు (అంటే 225 కిలోలు) విత్తనం ధర రూ. 11 వేలకు చేరింది.

- భారీగా పెరిగిన విత్తనం ధర
- గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 10 వేలు పైగా పుట్టు ధర
- డిమాండ్ పెరగడంతో అధికమవుతున్న విత్తన ధరలు
- సాగుకు సమాయత్తం అవుతున్న రైతులు



గొడవర్రులో నిల్వ చేసిన పసుపు కొమ్ములు

కంకిపాడు: వాణిజ్య పంటల్లో ప్రధానమైన పంటల్లో పసుపు సాగు కూడా ముఖ్యమైంది. కృష్ణాజిల్లా వ్యాప్తంగా ఏటా 2,763 హెక్టార్లలో పసుపు సాగుకు అనువైన భూమి ఉంది. రుతుపవనాల ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. అడపా దడపా మోస్తరు వానలు పడుతున్నాయి. దీంతో మెట్ట రైతులు పొలాలను దుక్కి దున్ని పసుపు విత్తనం నాటేందుకు సమాయత్తమవుతున్నారు.

పసుపు విత్తనానికి డిమాండ్

ఇక్కడి రైతాంగం కడప, మైదుకూరు, ప్రగతి, శేలం తదితర విత్తన రకాలను ఎంపిక చేసుకుని అనువైన విత్తన రకాలను సాగు చేస్తుంటారు. ప్రస్తుత సీజన్‌లో పసుపు విత్తనానికి డిమాండ్ పెరిగింది. గత ఖరీఫ్ సీజన్‌లో పుట్టు విత్తనం రూ. 5,500 వరకూ పలికింది. ప్రస్తుతం ఆ ధర ఏకంగా రూ. 10 వేల నుంచి రూ. 11 వేలకు పైగా పలుకుతోంది. కడప నుంచి వ్యాపారులు విత్తనాన్ని తెచ్చి విక్రయిస్తున్నారు. ఒడిశా, బిహార్ ప్రాంతాల నుంచి రైతులు రాష్ట్రానికి వచ్చి పసుపు విత్తనాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ఈ సీజన్‌లో ఎండు కొమ్ములు క్వింటా రూ. 14,500 వరకూ అమ్ముడవుతున్నాయి. ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ దఫా పసుపు సాగు విస్తీర్ణం కూడా పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. దీంతో విత్తనం కోసం డిమాండ్ పెరిగి, విత్తనం కొమ్ముల ధర ఊహించని విధంగా పెరిగిపోయింది.

ఆశల సాగు...

రైతులు తమ పంట చేతికి అందగానే పచ్చి కొమ్ములను ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో మార్కెట్‌లో విక్రయించారు. ఆ సమయంలో పుట్టు పచ్చి కొమ్ములు ధర రూ. 4,500 నుంచి రూ. 5 వేలు పలికింది. అదే రైతులు తిరిగి సీజన్ ఆరంభం కావటంతో విత్తనం కొనుగోలు చేసేందుకు వ్యాపారులను ఆశ్రయించగా ఆ ధర రూ. 10 వేలు దాటి పలుకుతోంది. ఎకరా విస్తీర్ణంలో పసుపు సాగు చేసేందుకు ఐదు నుంచి ఆరు పుట్లుల వరకూ విత్తనం అవసరం అవుతుంది. విత్తనం కోసం గతేడాది రూ. 30 వేల నుంచి రూ. 33 వేలు పెట్టుబడులు పెట్టిన రైతాంగం ఈ ఏడాది ఉన్న ధరతో రూ. 60 వేల నుంచి రూ. 66 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. పెట్టుబడి ఒక్కసారిగా రెట్టింపు కావడంతో సాగు భారంగా మారుతుందని భావిస్తున్నారు. అయితే మార్కెట్‌లో ఎండు పసుపు కొమ్ముల ధరలుపెరగడంతో, వచ్చే సీజన్‌లో ఆశించిన ధర వస్తుందనే ఆశతో సాగు పనులకు ఉపక్రమిస్తున్నారు.

అధ్వానంగా డొంక రోడ్డు



వర్షపునీటితో రహదారిపై ప్రమాదకరంగా మారిన గోతులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు నుంచి కానూరు వెళ్లె డొంక రోడ్డు అధ్వానంగా మారింది. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే రోడ్డు మార్గం గుంటలమయం అవ్వడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామవరప్పాడు నుంచి సమీప గ్రామాలైన ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు గ్రామాల్లోని ప్రయాణికులు, కార్మికులు, విద్యార్థులు ఎక్కువగా రాకపోకలకు ఈ మార్గంపై ఆధారపడ్డారు. ఈ మార్గంలో పలు కంపెనీలు, గోదాములు, విద్యాసంస్థలు ఉన్నాయి. ఆటోనగర్‌కు దగ్గరి మార్గం కావడంతో నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ఈ రోడ్డు మార్గం రాకపోకలకు ఏ మాత్రం అనువుగా లేదు. ప్రసాదంపాడు శ్రీశక్తి కల్యాణ మండపం నుంచి మొదలు ఈ రహదారి చివరి వరకూ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. దీనికి తోడు ఏ చిన్న పాటి వర్షం వచ్చిన ఈ గోతుల్లో వర్షపునీరు నిలిచి ప్రమాదకరంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఈ రోడు మార్గాన్ని అభివృద్ధి పరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యం



కోటయ్యను సన్మానిస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

గన్నవరం రూరల్: పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే కృష్ణామిల్క్ యూనియన్ లక్ష్యమని చైర్మన్ చలసాని అంజనేయులు పేర్కొన్నారు. ముస్తాబాద పాలకేంద్రం అధ్యక్షుడు కడియాల గోపాలరావు(కోటయ్య) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పాల ఉత్పత్తిదారులు 145 మందికి రూ. 3.85 లక్షల బోనస్‌ను ఆయన రైతులకు పంపిణీ చేశారు. వారందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో చైర్మన్ చలసాని ఆంజనేయులు మాట్లాడుతూ పాల ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు, రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. రైతు కుటుంబాలకు ఇన్సూరెన్స్ సౌకర్యం అమలు చేస్తున్నామని వివరించారు. పాల ఉత్పత్తి మరింత పెంచేందుకు రైతులు కృషి చేయాలని సూచించారు. కృష్ణా మిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వర్‌బాబు, జీఎం అనిల్‌కుమార్, డైరెక్టర్ పాలడుగు నాని, రూట్ మేనేజర్ కిలారి కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, వేతన కార్యదర్శి అర్జా సత్యనారాయణ, గ్రామ ప్రముఖులు కడియాల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు. ముస్తాబాద పాలకేంద్రంను అభివృద్ధి బాటలో నడిపించిన కోటయ్య సేవలను అతిథులు కొనియాడారు. అనంతరం కోటయ్యను చలసాని ఆంజనేయులు ఆత్మీయంగా సన్మానించారు.

పలు రైళ్లు దారి మళ్లింపు

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఖాజీపేట-బల్హార్షా సెక్షన్‌లో జరుగుతున్న నాన్-ఇంటర్ లాక్ పనుల కారణంగా విజయవాడ మీదుగా నడిచే పలు రైళ్లను దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్‌ఓ నుస్రత్ మండ్రుప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 22 నుంచి జూలై 5 వరకు విశాఖపట్నం -న్యూఢిల్లీ (20805/20806), ఈ నెల 27, జూలై 4 తేదీలలో విశాఖపట్నం–గాంధీధామ్(20803), ఈ నెల 23, 30 తేదీలలో గాంధీధామ్–విశాఖపట్నం (20804), ఈ నెల 23, 30 తేదీలలో పూరి–ఓఖా (20819) ఈ నెల 26, జూలై 3 తేదీలలో ఓఖా–పూరి (20820), ఈ నెల 24, 28, జూలై 1, 5 తేదీలలో విశాఖపట్నం–నిజాముద్దీన్ (12803), ఈ నెల 23, 26, 30, జూలై 3 తేదీలలో నిజాముద్దీన్–విశాఖపట్నం (12804) రైళ్లను వయా విజయనగరం, రాయగఢ, టిట్లాగఢ్, రాయ్‌పూర్, నాగ్‌పూర్ స్టేషన్ మీదుగా దారి మళ్లించి నడపనున్నట్లు తెలిపారు.

సికింద్రాబాద్–కొల్లం రైలు రద్దు....

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో జరుగుతున్న పలు నిర్వహణ పనుల కారణంగా సికింద్రాబాద్–కొల్లం మధ్య నడిచే రైలును రద్దు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 12న సికింద్రాబాద్–కొల్లం (07193) రైలును, ఈ నెల 14న కొల్లం–సికింద్రాబాద్ (07194) రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

సీఎం ప్రమాణ స్వీకారం కోసం 20 ఎల్‌ఈడీ స్క్రీన్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవాడ, పరిసర ప్రాంతాల ప్రజలు ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు నగరంలో 20 ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మంగళవారం తెలిపారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం, అంబేడ్కర్ స్మృతి వనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్, లెనిన్ సెంటర్, పటమట జెడ్పీ హైస్కూల్ రైతు బజార్, అజిత్‌సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య స్టేడియం, జింకానా గ్రౌండ్, విద్యాధరపురం స్టేడియం, పాలిటెక్నిక్ కళాశాల గ్రౌండ్, ప్రసాదంపాడు అన్నపూర్ణ రైస్ మిల్, సూర్య గోడౌన్, ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజ్, అను మై బేబీ హాస్పిటల్, నిడమానూరు బ్లూ బర్డ్ గ్రౌండ్స్, కేకేఆర్ గౌతమ్ స్కూల్, సవారిగూడెం - కేసరపల్లి మధ్య బహిరంగ ప్రదేశం, కృష్ణలంక రాణిగారితోట మైదానంలో ఈ ఎల్‌ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశామని వివరించారు. ఆయా ప్రాంతాల ప్రజలు ఎల్‌ఈడీ స్క్రీన్ల ద్వారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించాలని కలెక్టర్ ఢిల్లీరావు కోరారు.

ఈఏపీసెట్‌లో సత్తా చాటిన విద్యార్థులు

పెనమలూరు: ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో మండల విద్యార్థులు సత్తా చాటారు. పెనమలూరు మండలంలోని విద్యార్థులకు 19, 30, 48, 85, 119, 236 రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. గతంలో లేని విధంగా ఈ ఏడాది విద్యార్థులు ఉత్తమ ర్యాంకు సాధించారు.

- యనమలకుదురుకు చెందిన లక్ష్మీకౌశల్ రాష్ట్ర స్థాయిలో 19వ ర్యాంకు సాధించాడు. కౌశల్ చిన్నతనం నుంచి ఉత్తమ విద్యార్థిగా ప్రతిభ చాటాడు. తండ్రి శ్రీనివాస్ రైతు, తల్లి చంద్రిక గృహిణి. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ లేదా ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ చేయాలని ఉందని లక్ష్మీకౌశల్ తెలిపాడు.
- కానూరు గ్రామానికి చెందిన పి.వెంకటసాయితేజకు రాష్ట్ర స్థాయిలో 30వ ర్యాంకు వచ్చింది. కానూరు ఎస్‌బీఐ కాలనీ విశాల్‌టవర్స్‌లో ఉంటున్న తల్లిదండ్రులు పి.కృష్ణ, సరితలు నీటిపారుదల శాఖలో ఉద్యోగులుగా పని చేస్తారు. జేఈఈ అడ్వాన్స్‌లో కూడా 126వ ర్యాంకు వచ్చింది.
- కానూరు శ్రీధర్మా రెసిడెన్సీలో ఉంటున్న నందిపాటి సిద్ధార్థ రెడ్డికి రాష్ట్ర స్థాయిలో 48వ ర్యాంకు వచ్చింది. తెలంగాణ ఎంసెట్‌లో కూడా 18వ ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌లో 34వ ర్యాంకులో ఉన్నాడు. తండ్రి శ్రీనివాసరెడ్డి వ్యాపారం, తల్లి రాధిక గృహిణి.
- కానూరు అమరావతి కాలనీకి చెందిన నలబోలు సాయిఅనురుద్‌రెడ్డి 85వ ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్‌లో కూడా మంచి మార్కులు సాధించాడు. తండ్రి సుధాకర్‌రెడ్డి దాచేపల్లి మండలం పొందుగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. తల్లి శిల్ప గృహిణి.
- తాడిగడపకు చెందిన తాడిగడప మౌనికకు అగ్రికల్చర్‌లో 256వ ర్యాంకు వచ్చింది. తెలంగాణ ఎంసెట్‌లో 742వ ర్యాంకుతో పాటు నీట్‌లో 636వ ర్యాంకుతో సత్తా చాటింది. మెడిసిన్ చదివి న్యూరో డాక్టర్ అవ్వాలని ఉందని తెలిపింది. తండ్రి తాడిగడప ఉమాకుమార్ కారు మెకానిక్‌గా పని చేస్తాడు. తల్లి భవాని గృహిణి.
- పోరంకి నారాయణపురంకాలనీకి చెందిన యలమంచిలి హర్షవర్ధన్‌కు 119వ ర్యాంకు వచ్చింది. ఐఐటీ ముంబాయిలో చేరుతానని అన్నారు.

విద్యతో విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): విద్య అనేది పరీక్షల్లో మార్కుల కోసం కాకుండా యువతలోని విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా ఉండాలని ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్(ఐపీఈ) మాజీ డీన్ ఎంఎల్.సాయికుమార్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాల్‌లో గ్రూమింగ్ ఫర్ హైరింగ్ అనే అంశంపై మంగళవారం సదస్సు జరిగింది. సాయికుమార్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు మార్కుల కోసం కాకుండా తమలో జ్ఞానాన్ని పెంచుకుని తాము మంచి విద్యావంతులుగా మారాలనే ఉద్దేశంతో చదవాలని చెప్పారు. యువత తీసుకునే నిర్ణయాలకు, వాటి ఫలితాలకు వారే బాధ్యత వహించాలన్నారు. కళాశాలలో చదువుకునే సమయంలో యువతీ యువకులు గుడ్ బాయ్, గుడ్ గర్ల్‌గా ఉండాలని ఎలా తాపత్రయపడతారో అదేవిధంగా ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా గుడ్ ఎంప్లాయ్‌గా మారడానికి ప్రయత్నించాలని సూచించారు. మంచి ఉద్యోగిగా రాణించాలంటే నిరంతర శ్రమతో పాటుగా పటిష్టమైన ప్రణాళిక, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. వృత్తి పరమైన నైపుణ్యాలపై అవగాహన, నిబద్ధత, భావ వ్యక్తీకరణ, టీమ్ వర్క్ చాలా అవసరమన్నారు. సదస్సు అనంతరం విద్యార్థుల సందేహాలను ఆయన నివృత్తి చేశారు. కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల సదస్సుకు అధ్యక్షత వహించారు. అధ్యాపకులు, ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా అందజేత



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ వి.శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ రూ. 5 లక్షల ప్రమాద బీమా మంజూరు చేసింది. ఈ మేరకు సొసైటీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ వి.లీలా చేతుల మీదుగా మృతుడి భార్య వి.సుజాతకు చెక్కును అందజేశారు. సంఘ్ ప్రెసిడెంట్ ఎస్.రామగుప్తా, సొసైటీ సభ్యులు బి.ప్రభాకరబాబు, ఎస్వీఏ మల్లేశ్వరరావు, మహేష్ నాయుడు, రాజారావు పాల్గొన్నారు.

సబ్సిడీపై వరి విత్తనాల విక్రయాలు

విజయవాడరూరల్: ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు రైతులకు కిలో ఐదు రూపాయల సబ్సిడీపై విక్రయిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో ఎంటీయూ–1318, ఎంటీయూ–1061 30కిలోల బస్తా రూ. 1,060 చొప్పున విక్రయిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎంటీయూ–1224, బీపీటీ 5204 రకాల వరి విత్తనాలు రావాల్సి ఉందన్నారు.

ఆటో ఢీ కొనడంతో వ్యక్తికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఆటో ఢీ కొట్టిన ఘటనపై మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదలకు చెందిన చొప్పవరపు త్రినాథ్ తాపీ పని చేస్తుంటారు. ఈయన ఈ నెల 9వ తేదీ సాయంత్రం కే హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని ఆటో ఢీ త్రినాథ్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన ఆయన మంగళవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెత్తపై యూజర్ చార్జీలను నిలిపివేయాలి



పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరంలో నివాస గృహాలు, వాణిజ్య సంస్థల నుంచి చెత్తను సేకరించినందుకు వసూలు చేసే యూజర్ చార్జీలను వెంటనే ఉపసంహరించాలని వీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు కోరారు. ఈ మేరకు ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సాధారణ ఎన్నికల్లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం రద్దు చేస్తామని ఎన్నికల వాగ్దానంలో హామీ ఇచ్చిందన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇప్పటి వరకు నగర ప్రజలు, వాణిజ్య సంస్థల నుంచి వసూలు చేస్తున్న యూజర్ చార్జీలను వెంటనే రద్దు చేసేలా కౌన్సిల్‌లో తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించాలని ఆయన పేర్కొన్నారు. నగరంలో ప్రతి డివిజన్ నుంచి స్వచ్ఛ సర్వేక్షన్ క్లాప్ పథకం అమలు చేయడానికి ఏర్పాటు చేసిన క్లాప్ ఆటో డ్రైవర్ల వేతనాలను వెంటనే చెల్లించాలని మేయర్‌కు వివరించానని చెప్పారు. నగరంలో జరుగుతున్న తాగునీటి సరఫరాపై వెంటనే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కలుషిత నీటి వల్ల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని మేయర్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం శ్రీదాసాంజనేయ స్వామివారి దేవాలయంలో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను ఈనెల 13వ తేదీ గురువారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

PUBLIC NOTICE

Under instructions from my Client Jakka Murali Krishna, S/o. Sivaprasad resident of D.No. 9-69/4, Flat No. 102, Sri Sai Charan Residency, Priya Nagar, Poranki Village, Penamaluru Mandal, Krishna District I am issuing this public Notice that my client is entered in sale agreement dated. 25-5-2024 with Koganti Ramamohana Rao for proposed purchase of an extent of 150 Sq. Yards vacant site bearing Plot No. 415 situated to nearest Door No. 7-195 in R.S. No. 338/3 of Poranki Village, Penamaluru Mandal, Krishna District and its bounderies is East : Plot No. 395 property of Pilli Srinivas 32.14 feet West : 33 feet width Road 32.14 feet, North : Plot No. 414 property of Desu Rama Subba Rao 42 feet, South : Plot No. 416 property of Duddu Kanakadurga 42 feet. Originally a total extent of Ac. 2.34 cents bearing R.S.No. 338/3 and R.S. No. 337/4 situated in Poranki Village was acquired by Smt. Kilaru Venkata Subbamma under Regd. Gift deed No. 442/1955 dated : 22-4-1955. While enjoining the property Smt. Kilaru Venkata Subbamma died intestate 22-7-2001. After the death of Smt. Kilaru Venkata Subbamma her legal heir (son) Kilaru Ramamohana Rao acquired an extent of Ac. 2.34 cents bearing R.S.No. 338/3 and R.S. No. 337/4 situated in Poranki Village and after the Plotting Kilaru Ramamohana Rao sold an extent of 150 Sq.yards bearing Plot No. 415 to Smt. Koganti Parvathi under Regd. Sale deed No. 872/2002 dated : 22-2-2002 registered before Kankipadu SRO. As per the Penamaluru Tahsildar certificate dated : 2-5-2024 Plot Number 415 area comes in R.S.No. 338/3 of Poranki Village. After that Smt. Koganti Parvathi executed Regd. Gift deed No. 11738/2024 dated : 14-05-2024 infavour of her Husband Koganti Rama Mohana Rao for schedule property in turn Koganti Rama mohana Rao executed Sale agreement infavour of Jakka Murali Krishna for sale of schedule Property. Smt. Kilaru Venkata Subbamma was expired and if any L.R.'s other then Kilaru Ramamohana Rao are there and they have any objections or any Claims about the property sold in Regd. Sale deed No. 872/2002 dated : 22-2-2002 they have to Submit written objections or claims within 8 days from the date of public notice to the below stated address. After 8 days any objections and any claims cannot be considered on said property.

SK. Riyaz, Advocate, Plot No. 160, Sai Satya Dev Nagar, Neppalli, Kankipadu (Mandal), Krishna Dist.